


దేశానికి స్వాతంత్ర్యం అర్ధరాత్రొచ్చింది. అత్యవసరమైన ఆర్డినెన్సులన్నీ అర్ధరాత్రే జారీ అవుతాయి. అలాగే ఓ అర్ధరాత్రి బ్రహ్మాండమైన ఆర్డినెన్సు జారీ చేసింది మన ప్రభుత్వం.

సదరు ఆర్డినెన్సు ప్రకారం వివిధ ప్రైవేటు సంస్థల ఆధీనంలో నడుస్తున్న పత్రికలన్నింటినీ ప్రభుత్వం జాతీయం చేసింది. ఇకనుండి దేశంలోని చిన్నా పెద్దా పత్రికలన్నీ ప్రభుత్వ ఆధీనంలోనే నడుస్తాయి. పేపరు బోయ మొదలు పత్రిక ఎడిటర్ వరకు ప్రతి ఉద్యోగినీ ప్రభుత్వమే నియమిస్తుంది. వారికి ఇతర ప్రభుత్వోద్యోగులతో పాటు, జీతాలు, అలవెన్సులూ, సౌకర్యాలూ ఉంటాయి.

తర్వాత పత్రికలకు రచనలు పంపే రచయితల విషయంలో కూడా ప్రభుత్వమో విప్లవాత్మకమైన చర్య తీసుకుంది. అదేంటంటే!... రచయితల్ని మూడు గ్రేడులుగా విభజించి వారికి లైసెన్సులిస్తుంది. ఇలా లైసెన్సులివ్వటం వలన ప్రమాదకరమైన రచనలు చేసే రచయితల్ని అరికట్టవచ్చునని ప్రభుత్వం అభిప్రాయం. ఈ లైసెన్సులు ఇవ్వటానికో ప్రభుత్వ ఆఫీసరూ, అతనికో ఆఫీసూ వుండాలి. లైసెన్సులు కావలసినవారు తమ అర్హతల్ని తెలుపుకుంటూ సదరు ఆఫీసరు గార్కి అప్లయి చేసుకోవాలి. ఆయన వారివారి "క్వాలిఫికేషన్లు" పరిశీలించి వారికి తగిన గ్రేడ్ లైసెన్సులిస్తారు.

లైసెన్సుల వివరాలివి:—

గ్రేడ్ (1) హెవీరైటర్ ఈ లైసెన్సుగల రచయిత అన్ని రకాల రచనలను ప్రభుత్వాధీనంలోని అన్ని పత్రికలకు పంపుకోవచ్చు.

గ్రేడ్ (2) లైట్ రైటర్: ఈ లైసెన్సుగల రచయిత, నవలలు, సీరియల్ నవల్లు, వంటివి వ్రాయటానికి అనర్హుడు. అవి తప్ప మిగిలిన రచనా ప్రక్రియలన్నీ వ్రాసుకోవచ్చు.

గ్రేడ్ (3) లెర్నర్:— ఈ లైసెన్సు గల రచయిత కేవలం మినీకథలు, కవితలు, చిన్నచిన్న వ్యాసాలూ వ్రాయటానికి మాత్రమే అర్హుడు. పోతే, ఉత్తరాల రచయితల విషయంలో ఎట్టి లైసెన్సూ అవసరంలేదు. వారు నిర్భయంగా అని పత్రికలకూ ఉత్తరాలు రాసుకోవచ్చు. అంటే...సన్నకారు రైతులకు పన్నులు మినహాయించినట్టు ఉత్తరాల రచయితలకు లైసెన్సులు మినహాయించిందన్నమాట ప్రభుత్వం.

ఉత్తరాల రచయితల విషయంలో ఎట్టిలైసెన్సూ అవసరం లేదు. వారు నిర్భయంగా అన్ని పత్రికలకూ ఉత్తరాలు రాసుకోవచ్చు అంటే....సన్నకారు రైతులకు పన్నులు మినహాయించినట్టు ఉత్తరాల రచయితలకు లైసెన్సులు మినహాయించిందన్నమాట ప్రభుత్వం. లైసెన్సులు ప్రతి సంవత్సరం రెన్యూవల్ చేయించాలి.

లైసెన్సులు ప్రతి సంవత్సరం రెన్యూవల్ చేయిస్తూ ఉండాలి. రెన్యూవల్ చేయించటం ఆలస్యం అయితే పెనాల్టీ వసూలు చేస్తారు. ఏలాంటి పరిస్థితులలో అయినా ఓ సంవత్సరం రెన్యూవల్ చేయించకపోతే, మళ్ళీ లైసెన్సు కావాలనుకున్నప్పుడు కొత్తగా లైసెన్సు తీసుకోవాల్సివుంటుంది. లైసెన్సుగల రచయిత, ఎట్టి పరిస్థితులలోనూ, ప్రమాదకరమైన


అసభ్యకరమైన రచనలను చేయకూడదు. అలా చేసినట్లయితే అతని లైసెన్సు వెంటనే రద్దవుతుంది. అలా ఒకసారి రద్దయిన, లైసెన్సు ఎట్టి పరిస్థితుల్లోనూ పునరుద్ధరింపబడదు. ప్రమాదకరమైన అసభ్యకరమైన రచనలంటే ఏమిటో?... ప్రభుత్వం విపులీకరించింది.

పత్రికలకు రచనలు పంపేటప్పుడు హామీ పత్రం జతపరచనవసరంలేదు. లైసెన్సు నెంబరూ దాని వివరాలు రాసేచాలు. అలా చేయని రచనలు ఎంతబావున్నా ప్రచురించరు. అసలు పరిశీలించరు.

ఇక పత్రికలు విక్రయించే విషయంలో ఏజెంట్లుండరు. ప్రభుత్వోద్యోగులే పత్రికల్ని విక్రయిస్తారు. వారికి కమీషను కాక ఎంచక్కా జీతాలుంటాయి. అవికూడా ప్రభుత్వ పే స్కేల్సును అనుసరించి.

—ఇవీ క్లుప్తంగా ప్రభుత్వం జారీచేసిన పత్రికల జాతీయాకరణ ఆర్డినెన్సును గురించిన వివరాలు.

"అబ్బా! ఉన్నట్టుండి దేశమెంత అర్జెంటుగా బాగుపడిపోతుందీ?...ఇన్నాళ్ళూ ప్రయివేటు పత్రికల్ని చదివి, చదివి విసిగిపోయిన పాఠకులు ఇక ప్రభుత్వ పత్రికల్ని చదివి ఆనందించొచ్చు" అని సంబరపడిపోయాను. నేనేకాదు, నాలాగే అందరూ పడిపోయారు, సంబరం....




మిలమిలమంటూ మార్కెట్లో కొచ్చాయి. ప్రభుత్వ పత్రికలు, అసలు పత్రికల గెటప్పే మారిపోయింది. పాత శీర్షికలన్నీ గల్లంతు. అన్నీ కొత్త శీర్షికలే కొత్తదనంతో నిండి పొర్లి పోతున్నాయి పత్రికలన్నీ కొత్త గెటప్‌తో వెలిగిపోతున్నాయి ఎంతైనా ప్రభుత్వమంటే ప్రభుత్వమే అనుకున్నాను మనస్సులో.

తొలిపత్రికలో—అసలు పత్రికలెందుకు జాతీయం చేయవలసి వచ్చిందీ?....అలా చేయటంవలన పాఠకులకు ఒనగూడేమేళ్ళు, పాఠకుల సంక్షేమానికీ, చిన్నకారూ, సన్నకారు రచయితల అభివృద్ధికీ ప్రభుత్వం తలపెట్టిన పథకాలూ, మొదలైన విషయాలతో ఎడిటర్ గారి నాలుగు పేజీల సంపాదకీయం. (గమనిక: ఇప్పుడు ఎడిటర్ గారు ప్రభుత్వోద్యోగి). తర్వాత ప్రముఖ నాయకులూ, మంత్రుల శుభాకాంక్షలు సందేశాలతో వారివారి పెద్ద పెద్ద ఫోటోలు. ఇంకా అధికార పార్టీ పోయిన ఎలక్షన్లప్పుడు చేసిన వాగానాలూ, వాటిని వచ్చే ఎలక్షన తర్వాత ఏ విధంగా నెరవేర్చబోతున్నదీ. దానికి తాము తయారు చేసిన ఇరవై సూత్రాల కార్యక్రమం మొదలైన అంశాలెన్నో కుప్పలు తెప్పలుగా ఉన్నాయి.

ఆ విధంగా పత్రికా రంగంలో ప్రయివేటు యుగం పరిసమాప్తమై ప్రభుత్వయుగం ప్రారంభమైంది.

కాలం సినిమా రీలులా తిరుగుతుంది. పెళ్ళికాబోతుందంటే ప్రతివాడూ సంతోషపడేవాడే! కానీ పెళ్ళయిన తర్వాత ఆ సంతోషం ఎంతోకాలం ఉండదు, ఆతర్వాత పెళ్ళెందుకు చేసుకున్నాంరా భగవంతుడా? అని ఒక్కసారయినా బాధపడనివాడూ ఉండడు. సంసార బంధంలోని ఇబ్బందులలాంటివి. సరే దానికీ దీనికి ఏం సంబంధం లేకపోయినా పత్రికలు జాతీయం చేస్తున్నారంటే కలిగినసంతోషం, ఆ తర్వాత మిగల్లేదు. ఎందుకు జాతీయం చేశార్రా భగవంతుడా? అనుకునేంతగా అభివృద్ధి సాధించాయి మన పత్రికలు. అందుక్కారణం?....

ఏ పత్రిక తిరగేసినా ఏముంది గర్వకారణం?...

.... ... ....

ఎడిటర్ గారు. సిక్ లీవు లో ఉండటంవలన ఈవారం సంపాదకీయం ప్రచురించటంలేదు. పాఠకులు మాతో సహకరించవలసిందిగా మనవి!

ఫర్ ఎడిటర్.

* * *

సంపాదకీయం ఉండవలసిన స్థానంలో ఖాళీ!.... ఇలా ఒక వారముంటే, మరోవారం గల్లంతయ్యే సంపాదకీయం.

"ప్రసవవేదన" సీరియల్ రచయిత్రి శ్రీమతి కాన్పుకుమారి మెటర్నిటీలీవులో ఉండటంవలన, ఆమె స్థానంలో లీవు వేకెన్సీలో పోస్టుచెయ్యబడ్డ కుమారి ప్రసూతిరాణి ఈ వారం నుండి ఆ సీరి

యల్‌ను రాస్తున్నారు పాఠకులు గమనించగలరు.

(అంటే, ముందెవ్వరు మొదలుపెడతారో. ఎవరు ముగిస్తారో. మధ్యలో ఎందరు మారుతారో అంతా అయోమయం)

... .... ....

మా పత్రిక ఫొటోగ్రాఫర్ గోవిందరావు ఉద్యోగావకాశాల కొరకు "దుబాయ్" వెళ్ళిపోవటం వలన. ఆ స్థానంలో ప్రభుత్వం వారు మరో ఫొటోగ్రాఫర్ని సెలెక్ట్ చేసి పంపటంలో ఆలస్యం అయినందువలన, ఈ వారం నుండి పత్రికలో ఫొటోలు వేయటం నిలిపివేశాము. పాఠకులకు కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నాము.

-ఎడిటర్

... ... ...

మా కంపోజింగ్ సెక్షన్‌లో అధికశాతం పండుగ సెలవుల్లో ఉండటంవలన, ఉన్న బహుకొద్ది మంది సిబ్బందితో ఓవర్‌టైమ్ చేయించి, ఏదో విధంగా పత్రికను విడుదల చేయటానికి మేం చేసిన కృషివల్ల ఈవారం పత్రికలో కాస్త అచ్చుతప్పులు ఎక్కువగానే కనపడతాయి. పాఠకులు మా తప్పులను ఒప్పులుగాభావించి మాతో సహకరించగలరని మనవి.

-ఎడిటర్

—పాఠకులకు తరచుగా పత్రికల్లో దర్శనమిచ్చే పై ప్రకటనలు మచ్చుకి కొన్ని మాత్రమే!...

ఇక పత్రికా నిర్వహణలో సిబ్బంది ఎదుర్కొనే ఇబ్బందుల విషయానికొస్తే.....

"హల్లో! ఎవరూ? "దేశభక్తి" పత్రికాఫీసేనా?...."

"అవునండీ!"

"నేను, అహంకారశాఖ మంత్రి అహోబిలరావుని మాట్లాడుతున్నాను. ఎడిటర్ గారున్నారా?"

"నమస్కారమండీ. నేనే మాట్లాడుతున్నాను"


"నమస్కారం? నమస్కారం!"

"చెప్పండి ఏంటి విశేషాలు?"

"ఏంలేదు మా ఆవిడో కథ రాసింది."

"మంచిపని చేసింది"




"అందుకేగా నీకు ఫోన్ చేస్తా!"

"ఆఁ! చెప్పండి"

"ఆ కథని మీ పత్రికలో వెయ్యాలి"

"బాగుంటే, తప్పకుండా..."

"బాగుండటం?... వ్రాసింది మా ఆవిడయ్యా బాగోకపోవట మేమిటి?.... ఈ విషయం నా ముందంటే అన్నావు మా ఆవిడ ముందు...."

"అవునవును, మీ ఆవిడగాస్తే తప్పకుండా బావుంటుంది. తప్పకుండావేస్తాం. ఇంతకీ లైసెన్సు అదీ..."

"లైసెన్సా?.... ఆ తిప్పలేవో నీవేపడు. కావాలంటే ఆ ఆఫీసరుకు ఫోన్ చేసి చెప్పమంటే చెపుతాను. రేపు పి.ఎ. చేత కథ పంపిస్తాను, వచే వారమే పబ్లిష్ కావాలి"

"చిత్తం!"

.... .... ....

గౌరవనీయులైన ఎడిటర్ గార్కి,

నేనో విద్యార్థి నాయకుణ్ణి. విద్యార్థుల సమస్యలని గురించో విప్లవాత్మకమైన కథ రాశాను నాకు లైసెన్సు లేదనుకునేరు. హిప్పీరైటర్ లైసెన్సుంది అదెలా సంపాయించానో మీకనవసరం. ఈ కథని ఒక్క అక్షరం కూడా ఎడిట్ చెయ్యకుండా, వచ్చేనెల మొదటి వారం పత్రికలో ప్రచురించండి. అప్పుడు మా కాలేజీ ఏనివర్సరీ. అలా చెయ్యని పక్షంలో, మీకూ మీ పత్రికాఫీసుకు బస్సులకు రైళ్ళకు పట్టిన గతి పడుతుంది మీ ఇష్టం.

ఇట్లు

"చిచ్చు పిడుగు"

(విద్యార్థి నాయకుడు)

"అల్లో! ఎవ్వరయ్యా అవకాడ మాటాడేది?...."

"నేనండీ 'దేశభక్తి' ఎడిటర్ని"

"ఇదో, ఎడిటూ నీకెన్నిసార్లు చెప్పాలయ్యా ఆ ఎగస్పార్టీవోళ్ళ పొటోలు పేపర్లో వెయ్యొద్దనీ?"

"అబ్బే. వాటక్రింద వాళ్ళని విమర్శిస్తూ రాశానుకదండీ!"

"ఇమర్శతూ రాయనయ్యా! పొట్టోలెవుడెయ్యమన్నాడో? పెద్ద పెద్ద పొట్టోలేసి అళ్ళకి పెబ్లిసిటీ ఇచ్చేత్తంటే అదెవుడికిదెబ్బ?.... మాకు, ఈ రాజకీయాలు నీకు తెలవ్వుగాని, ఇదో, ఇట్టా జేత్తే ఎక్కువ రోజులుండవు జాగ్రత్త! ఓ రాజకీయ నాయకుని బెదిరింపు.

—ఇలా చెప్పుకుంటూ పోతే ఇంకావెన్నో. మొత్తానికి ప్రభుత్వ రంగ సంస్థల కుండవలసిన అన్ని తగులాట్లు పత్రికారంగాన్ని పట్టుకున్నాయి. డబ్బు పెట్టి పత్రిక కొనే పాఠకుడికి ఆనందం, విజ్ఞానం, వికాసం, కలుగజెయ్యవలసిన పత్రికలు, విసుగూ, అసంతృప్తి, తలనొప్పి కలుగజెయ్యటం మొదలెట్టాయి తత్ఫలితంగా






లక్షల్లో ఉన్న పత్రికల సర్క్యులేషన్ వేలకు పడిపోయింది. అన్ని ప్రభుత్వ సంస్థల్లాగే భారీఎత్తున నష్టాలు రాసాగాయి. చివరికి సిబ్బందికి జీతాలుకూడా ఇవ్వలేని స్థితికి దిగజారిపోయింది.

లోపం ఎక్కడుందో, నష్టాలెందుకొస్తున్నాయో అర్థంకాలేదు ప్రభుత్వ పెద్దలకు. మాకులాభాలు రావాలనిఆశలేదు. నష్టాలురాకుండా ఉంటే చాలు. కేవలం నష్టాలను భర్తీ చెయ్యటానికి మాత్రమే పత్రికల రేట్లు పెంచుతున్నాం. అంటూ పత్రికల రేట్లు పెంచింది. బస్సుల, రైళ్ళ చార్జీలు పెంచినట్లు

పత్రికలేమన్నా చక్కెర, కిరోసిన్ లాంటి నిత్యావసర వస్తువులేంకాదుగా. ఎంతరేట్లు పెంచినా నోరుమూసుకొని బ్లాకులో అయినా కొనటానికి. అందుకేజనం అసలు పత్రికలే కొనటం మానేశారు. తామొకటి తలిస్తే ప్రజలొకటి తలవటం శ్రీ ప్రభుత్వంవారికి తీవ్రంగా కోపమొచ్చేసింది. ఇలాంటి సమస్య ఎదురైనప్పుడు ప్రభుత్వం చేసే ఒకేఒక్క పని.

అదే... పదిమంది సభ్యులున్న ఓ కమిటీని వేసింది. ఈ సమస్యని చర్చించటంకోసం.

ఆ కమిటీ పదిరోజులు తీవ్రంగా చర్చించి (ఆ చర్చలకు పది లక్షలు ఖర్చయినట్లు పద్దుల్లో చూపించారు. అది ప్రస్తుతానికప్రస్తుతం) ఓ చట్టాన్ని ప్రవేశపెట్టింది. అదే "నిర్బంధ పత్రికా పఠన చట్టం."

పత్రికలు చదవకపోతే ప్రజలు పాడైపోతారు. ప్రజలు పాడైపోతే దేశమింకేమన్నా ఉంటుందా?.... అందుకే ప్రతిపౌరుని చేత తప్పకుండా పత్రికలు చదివించాలి అన్నదే ఆ చట్టం యొక్క సారాంశం. ఆ చట్టాన్ననుసరించి ఒక ఇంటిలో ఇద్దరుకంటే ఎక్కువ చదువుకున్న వాళ్ళున్నట్లయితే తప్పనిసరిగా ఓ పత్రిక కొని చదవాలి. చదవటం ఇష్టం లేకపోయినా నిర్బంధంగా చందా వసూలు చేస్తారు. ఒక ఇంటిలో రెండుకంటె ఎక్కువ భాషలు తెలిసిన వారున్నట్లయితే, వారు తప్పకుండా రెండు పత్రికలు తెప్పించుకోవలసి ఉంటుంది. అవి ఒకే భాషవైనాకావచ్చు, వేర్వేరుభాషలవైనా కావచ్చు. అది వారి వారి ఇష్టాన్నిబట్టి ఆధారపడి ఉంటుంది. షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు జాతులు, బలహీనవర్గాలవారి విషయంలో పత్రిక రేటులో ఇరవై అయిదుశాతంకన్సెషన్ ఉంటుంది అంతేకాదు విద్యార్థుల్నికూడా ఈ చట్టం వదిలిపెట్టలేదు. ఎలిమెంటరీ స్థాయినుంచే ప్రతి విద్యార్థి తప్పని సరిగా పత్రికలు చదవాలి. ప్రతి విద్యార్థీ తన కిష్టమైన ఏదో ఓపత్రికను ఆప్షనల్‌గా ఎన్నుకొని చదువవచ్చు. పరీక్షల్లో ఆ పత్రికకు సంబంధించిన ప్రశ్నలు కూడా ఉంటాయి. వాటికి పదిమార్కులుంటాయి.

నేను మాత్రం ఈచట్టాన్నుంచి ఎలా తప్పుకోవాలా?...అని ఆలోచిస్తున్నాను. జనాభాలెక్కలవాళ్ళొచ్చినప్పుడు మా ఇంట్లో నేనుతప్ప చదువొచ్చిన వాళ్ళెవరూలేరని చెప్తే?!....

✻


అలనాటి-చరిత్రలు-ఈనాటి మేటినవలలు



శ్రీ ప్రసాద్ రచనలు
(విజయ సీరియల్స్)

| | |
|---|---|
| విజయనగర పతనం-1 | 13.00 |
| విజయ నగర పతనం-2 | 12.00 |
| షాజహాన్ | 13.00 |
| సామ్రాట్ శ్రీరంగరాయ | 10.00 |
| లకుమాదేవి (లల్లాదేవి రచన ఆంధ్రభూమి సీరియల్) | 15.00 |
| ఆర్య చాణక్య | 13.50 |
| అప్పాజీ | 12.00 |
| యుగంధర్ | 13.50 |
| రోషనార | 10.00 |



* అన్ని బుక్ షాపుల్లోనూ దొరుకుతాయి. దొరక్కపోతే కావలసిన పుస్తకాల విలువలో ఒక రూపాయి తగ్గించి M.O. పంపితే మిగిలిన మొత్తానికి V.P.గా పంపుతాము!

నవజ్యోతి పబ్లికేషన్స్

నవజ్యోతి పబ్లికేషన్స్ ఏలూరురోడ్, విజయవాడ-520 002